
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

శనివారం 7 జూన్ 2025

జిల్లాల వార్తలు



జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల కంట్రోల్‌రూంను ప్రారంభిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

నేర నియంత్రణలో

సీసీ కెమెరాలు కీలకం

- జహీరాబాద్‌లో 93 చోట్ల నిఘా నేత్రాలు
- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

జహీరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు సీసీకెమెరాలు దోహదపడుతాయని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీసీకెమెరాల కమాండ్‌కంట్రోల్‌రూం, సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్క సీసీకెమెరా పది మంది పోలీసులతో సమానమని స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రధాన, అత్యవసర ప్రాంతాలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సీసీ కెమెరాలు అత్యంత దోహదపడుతాయన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు, ప్రభుత్వ నిషేధిత వస్తువుల రవాణ, అవకాశం ఉన్నందున వాటిని అధిగమించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు ఉపయోగకరంగా మారిందన్నారు. జహీరాబాద్‌లో త్వరలో ట్రాఫిక్‌పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానుందని చెప్పారు. మొగుడంపల్లి మండలంలో పోలీస్‌స్టేషన్ ప్రతిపాదనల్లో ఉందని తెలిపారు.



బాలికలకు భోజనం..
ఇక రుచి, శుచిగా..

- వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు శిక్షణ
- ఆహార తయారీ, నాణ్యత, పరిశుభ్రతపై అవగాహన
- మెనూలోని వంటకాలపై పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తర్ఫీదు

7

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు

ప్రొసీడింగ్స్ అందజేసిన నిర్మలాజగ్గారెడ్డి

కొండాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి పథకానికి ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి త్వరలోనే గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారుల నిర్మాణాలు చేపట్టాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైన 35 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అవకతవకలకు తావు లేకుండా.. ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారుల ఖాతాలోనే నేరుగా ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని చెప్పారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ వైప్రభు, సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, హౌసింగ్ పీడీ తిరుపతిరావు, డీఈ మాధవరెడ్డి, ఎంపీడీవో రత్నమని, హౌసింగ్ ఏఈ సౌజన్య, కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, అమీనొద్దీన్, అనిల్‌కుమార్, జైపాల్, పురుషోత్తం, రాజు తదితరులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డిని సన్మానిస్తున్న కొండాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు

బక్రీద్ కోలాహలం

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగకు జిల్లాలో ముస్లింలు సిద్ధమవుతున్నారు. ఈద్ అల్ అదాను పురస్కరించుకుని శనివారం ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలను చేయనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం పేద ముస్లింలకు ఖుర్బానీ ఇస్తారు. ఇందుకు అవసరమైన పొట్టేళ్ల విక్రయం కోసం శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో అంగళ్లు వెలిశాయి. ఒక్కో పొట్టేలు రూ.8వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది.

- మెదక్ కల్చరల్, (ఆంధ్రజ్యోతి)



నాలుగోసారి

గడువు పొడిగించేనా?

- గత నెలతో ముగిసిన ఎల్ఆర్ఎస్ గడువు
- సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో దరఖాస్తులు
- మరోసారి పొడిగిస్తారని ఎదురుచూపులు
- స్థలాల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి ఆదాయం



మెదక్, జూన్ 6 : స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ గడువు మే 31తో ముగిసింది. జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 21,615 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇందులో 15,726 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. మొత్తం ఫీజు రూపేణా రూ.16.85కోట్లు వసూలయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రాయితీ గడువు పొడిగించింది. ఇకపై ఫీజులపై రాయితీ ఉండకపోవచ్చునని టౌన్ ప్లానింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఇంకా వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుండడంతో మరోసారి గడువు పొడిగిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే మూడుసార్లు..

ఎల్ఆర్ఎస్ పథకం కింద గత ఫిబ్రవరిలో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకు వచ్చే అర్హులకు 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ గడువు మార్చి 31తో ముగియడంతో ఏప్రిల్ 3 వరకు పొడగించారు. వేల సంఖ్యలో దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉండడంతో మే 12 నుంచి 31వ తేదీ వరకూ కొనసాగించారు. ప్రస్తుతం మరోసారి అవకాశం ఇస్తేనే పెండింగ్ దరఖాస్తులు పరిష్కార మవుతాయని భావిస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం..

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రొసీడింగ్స్ కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోందని దఖాస్తుదారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల్లో సమన్వయం లోపించడంతో అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అర్జీదారుడు మొదట ఆన్‌లైన్‌లో తమ స్థల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుని, తర్వాత టౌన్‌ప్లానింగ్ కార్యాలయంలో స్టేటస్ చూసుకోవాలి. అధికారులు ఇంకా ఎల్ఆర్ఎస్‌కు కావాల్సిన అనుమతులు పెండింగులో ఉంటే వాటి వివరాలు చెబుతారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ కార్యాలయాలకు అర్జీదారులు పరుగులెత్తాల్సి వస్తోంది. అక్కడ రెవెన్యూ అధికారులు అడిగిన సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వడం లేదని, వారాల తరబడి తిరగాల్సి వస్తోందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఆ తర్వాత వారికి వీలున్న రోజున క్షేత్ర సందర్శన, విచారణ పూర్తిచేసి ఉన్నతాధికారులకు పంపుతున్నారు. గతంలో నాలా కన్వర్షన్ చేసుకోనివారు, మోటేషన్ లేనివారి దరఖాస్తులు అధికంగా పెండింగులో ఉంటున్నట్లు రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు.

యూనిఫాం, పాఠ్యపుస్తకాలు

తొలిరోజే పంపిణీ

- సంగారెడ్డి జిల్లాకు 7,02,990 పాఠ్యపుస్తకాలు
- 29 మండలాలకు 5,57,955 బుక్స్ పంపిణీ
- యూనిఫామ్ 98,430 జతలు రెడీ.. నాలుగు రోజుల్లో 10,889 జతలు
- ఈ నెల 11 నాటికి పాఠశాలలకు సరఫరా
- తొలి రోజు పండుగ వాతావరణంలో విద్యార్థులకు ఆహ్వానం



సంగారెడ్డి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరాన్ని పండగ వాతావరణంలో ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 12న బడులు పునఃప్రారంభ కానున్నాయి. బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి పాఠశాలల్లో వసతులు, బోధనపై విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెంచాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. పాఠశాలల పునఃప్రారంభం రోజున ప్రముఖులను ఆహ్వానించి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేసేందుకు అవరసమైన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఆదేశించింది.

యూనిఫామ్స్ 90 శాతం పూర్తి

సమగ్ర శిక్షాఅభియాన్ ద్వారా ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం అందజేస్తోంది. కుట్టు పని బాధ్యతన మహిళా సంఘాలకు అప్పగించింది. ప్రభుత్వం యూనిఫాం వస్త్రాన్ని సరఫరా చేయగానే విద్యార్థుల కొలతలను తీసుకుని కుట్టడం ప్రారంభించారు. ఒక్కో యూనిఫాం కుట్టడానికి రూ.75 చెల్లించనున్నారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1,09,319 మంది విద్యార్థులుండగా, 98,430 యూనిఫామ్స్ సిద్ధమయ్యాయి. మరో 10,889 మంది యూనిఫామ్స్ కుట్టాల్సి ఉన్నది. నాలుగైదు రోజుల్లో మిగిలిన యూనిఫామ్స్ కుట్టి 11వ తేదీ వరకు సరఫరా చేయనున్నారు.

చేరుకున్న పాఠ్యపుస్తకాలు

జిల్లాకు 7,02,990 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా నూరు శాతం జిల్లా కేంద్రానికి

మిగతా 8వ పేజీలో



మరమ్మతులకు నోచుకోని రోడ్లు

- తారు కొట్టుకుపోయి గుంతలమయంగా మారిన చీలపల్లి, పోట్‌పల్లి రహదారులు
- చిన్న వర్షానికే జలమయం
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు

8

పటాన్‌చెరు రైతులకు
'భరోసా' ఏది?

7



వేర్వేరు ప్రమాదాల్లో
నలుగురి మృతి

6

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో

సంజయ్‌సేథ్

యుద్ధట్యాంకును పరిశీలించిన రక్షణశాఖ సహాయ మంత్రి

అల్వాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్‌సేథ్ శుక్రవారం మెదక్ జిల్లా ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీలో తయారవుతున్న వివిధ రకాల ఉత్పత్తులను సీఎండీ సంజయ్‌ద్వివేది ఆయనకు చూపించారు. మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావుతో కలిసి మంత్రి ట్యాంకుపై రైడ్ చేశారు. అనంతరం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఆవరణలో మొక్కలను నాటారు.యూనియన్ సంఘాల ప్రతినిధులు సంజయ్‌సేథ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.



12 నుంచి
ఓపెన్ స్కూల్
అడ్మిషన్స్

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ విధానంలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుననట్లు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 11వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ 8008403635 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సులను
సద్వినియోగం
చేసుకోవాలి : కలెక్టర్



అనంతసాగర్‌లో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు తీరుతాయన్నారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులకు రాకుండా రెండు బృందాలుగా రెవెన్యూ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం చేగుంటలోని రేషన్‌షాప్‌ను సందర్శించి సన్నబియ్యం పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ స్వప్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు

ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చేగుంట సుభాష్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల ద్వారానే నాణ్యమైన్య విద్య బోధించడం సాధ్యమని పేర్కొన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బడుల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని, వాడడలో తిరుగుతూ బడీడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పే విధంగా కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను వివరించాలని సూచించారు. యూనిఫామ్, టెస్ట్ బుక్స్ నోట్‌బుక్స్ అందిస్తున్న విషయాన్ని వివరించాలని కోరారు. తల్లిదండ్రులు సూచించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎంఈవో నీరజ, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఐకేపీ ఏపీఎం లక్ష్మి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

పుల్కల్, జూన్6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకవచ్చిందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. శుక్రవారం నాడు మండలంలోని పోసానిపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరి మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సు దరఖాస్తుల స్వీకరణ పూర్తి అయిన అనంతరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారం కోసం వచ్చే రెవెన్యూ బృందా లకు ప్రజలందరు సహకరించాలన్నారు. భూ భారతి చట్టంలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఆర్జీలను ఇచ్చేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోసానిపల్లిలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధవి, డీఈఓ వెంకటేశ్వర్లతో కలిసి కలెక్టర్ క్రాంతి వల్లూరి పాల్గొని విద్యార్థులను ప్రభుత్వ విద్యా సంస్థలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఉంటుంద



పోసానిపల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సులో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

వెల్దుర్తిలో దొంగల బీభత్సం

తొమ్మిది బోరుబావుల వద్ద కేబుల్ వైర్లు చోరీ

వెల్దుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి కుడి చెరువు సమీపంలో, గంగమ్మ గుడి వద్ద ఉన్న పొలాల్లోని తొమ్మిది బోరుబావుల వద్ద కేబుల్ వైర్లను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం. వెల్దుర్తికి చెందిన అంగడిపేట అంజాగౌడ్, రమేష్ గౌడ్, మల్కా క్రిష్ణ, గుంటుకు యాదగిరి, జెగ్గ నరేందర్‌గౌడ్, గంగమ్మ ఆలయానికి సంబంధించిన వ్యవసాయ పొలాల వద్ద ఉన్న మోటార్ల నుంచి విద్యుత్ స్టార్టర్ వరకు గల కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ కేబుల్ వైర్ల విలువ సుమారు రూ. లక్షకు పైగా ఉంటుందని, చోరీకి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



'భేటీ బచావో-భేటీ పడావో'పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంగ్టి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా మహిళా సాధికార కేంద్రం ప్రత్యేకాధికారి నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టి అంగన్‌వాడీ సెంటర్-3లో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధమన్నారు. బాలికల హక్కుల గురించి, బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, అనిత, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

సదాశివపేట, జూన్ 6 : (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు, రైలు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కొండాపూర్ మండలం సైదాపూర్ తాండాకు చెందిన కుర్ర సాయికిరణ్ (23) అతని పెద్దమ్మ సునితా బాయ్, ఆమె కొడుకు అభిషేక్ (13) శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో బయలుదేరి సదాశివపేట మండలం నందికంది గ్రామశివారులోని ఓ మామిడి పండ్ల దుకాణం (హోల్‌సేల్) వద్ద మామిడికాయలు కొనుగోలు చేశారు. పండ్లను విక్రయించేందుకు సునితాభాయ్‌ని సదాశివపేట పట్టణంలో వదిలిపెట్టి సాయికిరణ్, అభిషేక్‌లు స్వగ్రామం సైదాపూర్ తండాకు ఆటోలో తిరుగుప్రయాణమయ్యారు. వికారాబాద్ రోడ్డు మార్గంలో సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న ఓ లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న సాయికిరణ్, ఆటోలో కూర్చున్న అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు సాయికిరణ్ స్థానిక ఎంఆర్ఎఫ్ టైర్ల పరిశ్రమలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఒకే గ్రామంలో ఇద్దరు చనిపోవడంతో సైదాపూర్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.


సదాశివపేట : ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రైలు ఢీకొని యువకుడు...

మనోహరాబాద్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళ అడవిలో వేటకు వెళ్లిన వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం మనోహరాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. శివ్వంపేట్ మండలం గోమారం గ్రామానికి చెందిన ఎరుకల సముద్రాల కృష్ణ గురువారం రాత్రి అడవి పందుల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి మనోహరాబాద్ రైల్వేస్టేషన్ శివారులోని రైల్వేపట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ హనుమాగౌడ్ తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు కంపెనీ సూపర్‌వైజర్ మృతిచెందాడు. మాసాయిపేట మండలం కొప్పులపల్లికి చెందిన మల్ల నాగరాజు (33) మనోహరాబాద్ శివారులోని సూపర్ సీడ్స్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం కంపెనీలో విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. తూప్రాన్ పట్టణ శివారులో పాత హైవే రోడ్డుపై ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నాగరాజు

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

తప్పిన ప్రమాదం

రామచంద్రాపురం టౌన్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి) రామచంద్రాపురం అశోక్‌నగర్‌లోని పిస్తాహౌస్‌లోని కిచెన్ విభాగంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది త్వరితగతిన స్పందించి మంటలను అదుపు చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని నిర్వాహకులు చెప్పారు.

అనారోగ్య సమస్యలతో

ఇద్దరు ఆత్మహత్య


మధు(ఫైల్)

వెల్దుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... వెల్దుర్తికి చెందిన జువ్వ మధు(62) కొన్నేళ్లుగా అధిక బరువు, బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి మద్యం మత్తులో విషం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వృద్ధుడు


గోపయ్య మృతదేహం

రాయపోల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం అనాజీపూర్‌లో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అనాజీపూర్ గ్రామానికి చెందిన మన్నె గోపయ్య(70) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం ఆశిరెడ్డి కుంట వెనకాల ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందినట్లు గుర్తించిన రైతులు గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు అతన్ని మన్నె గోపయ్యగా గుర్తించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధడుతూ మనస్తాపానికి గురైన గోపయ్య ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని కొడుకు సత్తయ్య తెలిపాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలింత ఆత్మహత్యాయత్నం

జోగిపేట రూరల్, జూన్6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ బాలింత శుక్రవారం అందోల్ పెద్దచెరువులోకి దిగి ఆత్మహత్యకు యత్నించింది. మహిళ నీటిలోకి దిగడాన్ని గమనించిన స్థానికులు ఆమెను రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం బాధితురాలిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.






1.స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, పొన్నం, కలెక్టర్ మనుచౌదరి 2.సభకు హాజరైన యువతులు 3. మేకల బండితో వస్తున్న యువకులు 4.మామిడి పండ్లను పరిశీలిస్తున్న సందర్శకులు

రైతు మహోత్సవం

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు మహోత్సవం శుక్రవారం అట్టహాసంగా షురూ అయ్యింది. పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లు, అధునాతన యంత్రాల ప్రదర్శన నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ స్టాళ్లను పరిశీలించారు. మేకలతో ఏర్పాటు చేసిన బండి ఆకట్టుకుంది. రైతులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.





యంత్రాల ప్రదర్శన



రైతు మహోత్సవానికి హాజరైన అన్నదాతలు, నాయకులు





ఉక్కపోతకు తాళలేక



హైదరాబాద్‌లో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజును సన్మానించి అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

విధి నిర్వహణలో నిజాయితీ

● సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిజాయితీ చాటిన ఆర్టీసీ సంగారెడ్డి డిపో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజులను ఆ సంస్థ ఎం.డీ.సజ్జనార్ అభినందించారు. ఈ నెల 4న బాన్సువాడ డిపో బస్సులో పిట్లంకు చెందిన ప్రయాణికుడు సిద్దులు జేబీఎస్‌లో బస్సు ఎక్కి సంగారెడ్డి కొత్త బస్టాండ్‌లో దిగి బ్యాగు బస్సులోనే మర్చిపోయారు. ప్రయాణికులు సిద్దులు ఈ విషయాన్ని డ్యూటీ కంట్రోలర్ జన్నుబాయ్‌కు సమాచారం అందించారు. కంట్రోలర్ వెంటనే స్పందించి జోగిపేట పాయింట్ కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న కండక్టర్ బస్వరాజ్ సాయంతో జోగిపేటలో ఆ బ్యాగును తీసుకుని సంబంధిత ప్రయాణికుడు సిద్దులుకు అందజేశారు. అయితే ఆ బ్యాగులో రెండున్నర లక్షల నగదు, ల్యాప్‌టాప్, ప్రొజెక్టర్ ఉన్నాయి. కాగా విధి నిర్వహణలో నిజాయితీ చూపిన సంగారెడ్డి డిపో కంట్రోలర్ జన్నుబాయ్, కండక్టర్ బస్వరాజులను ఆ సంస్థ ఎం.డీ.సజ్జనార్ శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు పిలిపించి సన్మానించి అభినందించారు.

ప్లాస్టిక్ రహిత వివాహ విందు

● స్టీలు, ఆకు ప్లేట్లు, ఫైబర్ గ్లాసుల వినియోగం



నారాయణఖేడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చిన్న పాటి శుభకార్యం జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, అలంకరణ సామగ్రి వినియోగించడం పరిపాటిగా మారింది. కానీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం మాద్వార్ తండాలో శుక్రవారం ప్లాస్టిక్ రహితంగా వివాహ వేడుకను జరిపించి ఆదర్శంగా నిలిచారు. మాద్వార్ తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్ సోదరుడు రమేష్ వివాహం లక్ష్మితో జరిగింది. ఈ వేడుకలో పర్యావరణ పరిరక్షణ కోసం ఎలాంటి ప్లాస్టిక్ సామాగ్రిని వినియోగించ లేదు. అదీకూడా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి స్టీలు, ఆకు ప్లేట్లు, నీరు తాగడానికి ఫైబర్ గ్లాసులను వాడారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్ రాజునాయక్‌ను అభినందించారు.

గణితం పరీక్షకు 43 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష జరిగింది. నాల్గవ రోజు 105 మందికి 62 మంది హాజరుకాగా 43 మంది గైర్హాజరయ్యారు. 59.05 హాజరు శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన

రామాయంపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెలనెలా వేతనాలు చెల్లించడం లేదని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రామాయంపేటలో సఫాయిలు ఆందోళన చేపట్టారు. విధులకు హాజరకాకుండా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని ఎంతోకాలంగా మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా నెలవారీగా వేతనాలు చల్లించాలని, లేనియెడల ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రామాయంపేటలో ధర్నా చేస్తున్న కార్మికులు

బాలికలకు భోజనం..

ఇక రుచి, శుచిగా..

- వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు శిక్షణ
- ఆహార తయారీ, నాణ్యత, పరిశుభ్రతపై అవగాహన
- మెనూ ప్రకారం రుచికర వంటకాలపై తర్ఫీదు
- పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. నాణ్యత లేని సరుకులతో వంటకాలు, అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేయడం తదితర కారణాలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. సాధారణంగా చాలా మంది వంట మహిళలకు పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం తయారీపై అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో బడి పిల్లలు ఆహారాన్ని తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ పలు చర్యలకు ఉపక్రమించింది. కస్తూర్బా గాంధీ విద్యాలయాలతో పాటు యూఆర్ఎస్, టీఆర్ఈఐఎస్, గర్ల్స్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న వంట మనుషులు, పారిశుధ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లాలోని అందోల్, కాశీపూర్ కేజీబీవీలో ఒక రోజు పాటు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అందోల్ కేజీబీవీలో వంట మనుషులకు, కాశీపూర్ కేజీబీవీలో పారిశుధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు.

మెనూ ప్రకారం ప్రత్యక్షంగా ఆహారం తయారీ

కేజీబీవీల్లో విద్యనభ్యసించే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యతతో కూడిన ఆహారం, వారుండే విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ నెల 12 వ తేదీ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండటంతో వచ్చే విద్యార్థులకు మంచి భోజనం అందించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆహార తయారీలో తర్ఫీదు పొందేందుకు జిల్లా నుంచి ఇద్దరు వంట మనుషులు, ఒక టీచర్‌ను, అదే విధంగా పరిశుభ్రత కోసం ఇద్దరు పారిశుధ్య కార్మికులు(స్వీపర్లు), ఒక ఏఎన్ఎంను హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. వీరు జిల్లా స్థాయిలోని శుక్రవారం అన్ని కేజీబీవీ, ఇతర విద్యాలయాల వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఆహార తయారీపై ఇచ్చిన శిక్షణకు 90 మంది, పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన శిక్షణకు 45 మంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం ఎలా తయారు చేయాలంటే ఎలాంటి పోపులు వేయాలి? వంటకు ఉపయోగించే ఆకుకూరలు, కూరగాయలు ఎలా శుభ్రం చేయాలి, తదితర అంశాలపై ప్రత్యక్షంగా వడ్డించి అవగాహన కల్పించారు. ఇలా ఉండగా జిల్లాలో 22 కేజీబీవీలుండగా, అందులో 5500 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఏదేమైనా విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంతో బాలికలకు ఇక నుంచి మరింత రుచికరంగా ఆహారం అందనుండడంతో పాటు పరిసరాలు పరిశుభ్రతకు పెద్దపీట వేసే అవకాశముందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



తయారు చేసిన వంటకాలతో వంట మనుషులు, అధికారులు



ఆహార తయారీకి కూరగాయలు కట్ చేస్తున్న వంట మనుషులు

పటాన్‌చెరు రైతులకు రైతు భరోసా ఏది?

రామచంద్రాపురం టౌన్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పటాన్ చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం మండలాల్లోని రైతులకు రైతుభరోసా చెల్లింపులు జరగలేదని వివరించారు. గుమ్మడిదల మండలంలోని రైతులకు రూ.3.78కోట్లు వారిఖాతాల్లో జమచేశారని తెలిపారు. మిగిలిన మండలాల్లోని 22,103 మందికి రూ.15.11కోట్లు జమకావాల్సి ఉందని తెలిపారు. నిధులు విడుదల చేస్తామంటూ మంత్రి హామీ ఇచ్చారని ఆయన వివరించారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

● తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

వెల్దుర్తి, జూన్6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని పంతులపల్లి గ్రామ సమీపంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టును ఆయన పరిశీలించారు. అలాగే వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తప్పకుండా వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారుల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు సరైన పత్రాలు వెంట ఉండాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట వెల్దుర్తి ఎస్ఐ రాజు, సిబ్బంది ఉన్నారు.



తనిఖీలను పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

షెడ్ల నిర్మాణానికి ఆర్థిక తోడ్పాటు

- ఉపాధి హామీ నిధుల వినియోగం
- జాబ్ కార్డు కలిగిన చిన్న, సన్నకారు రైతులు అర్హులు
- సిద్దిపేట జిల్లాకు 457 షెడ్లు మంజూరు

సిద్దిపేట రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల, పౌల్ట్రీఫాంల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందిస్తున్నది. అర్హులైన పెంపకందారులకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న సన్న, చిన్నకారు రైతులను అర్హులుగా గుర్తిస్తున్నది. 2024-25 సంవత్సరానికి సంబంధించి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 217 పశువుల షెడ్లు, 9 మేకల, గొర్రెల షెడ్లు, 5 పౌల్ట్రీ ఫాంలు నిర్మించగా, 2025-26కు సంబంధించి 457 షెడ్లు మంజూరయ్యాయి.

ఏ షెడ్డుకు ఎంతంటే..

పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.85 వేలు, గొర్రెలు, మేకల కోసం షెడ్డుకు రూ.లక్ష, పౌల్ట్రీ ఫాంకు రూ.3 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. అర్హులు ముందుగా పశు సంవర్ధక శాఖ అధికారి నుంచి పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. అనంతరం పెంపకందారులకు భూమి పట్టా పాస్ పుస్తకం లేదా ధ్రువీకరణ పత్రంతో ఎంపీడీవో లేదా ఉపాధిహామీ కార్యాలయంలో షెడ్డు నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు వాటిని పరిశీలించిన అనంతరం నిధులను మంజూరు చేస్తారు. 2025-26 సంవత్సరానికి సిద్దిపేట జిల్లాకు మంజురైన షెడ్లలో ఇప్పటికే 140 వరకు పూర్తయ్యాయి. అదేవిధంగా గొర్రెలు, మేకల షెడ్లు 27, పౌల్ట్రీ ఫాంలు 10 నిర్మాణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. షెడ్ల నిర్మాణంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పెంపకందారులకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే షెడ్ల బిల్లులు చెల్లింపుల్లో కొంత మేర ఆలస్యమవుతున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. త్వరగా బిల్లులు అందేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.



ఉపాధి హామీ పథకంలో నిర్మించిన పశువుల షెడ్డు

సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు చేసుకున్నవారి ధ్రువపత్రాలను పరిశీలించి సిబ్బంది వెళ్లి షెడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్నాం. ఇప్పటికే పూర్తయిన షెడ్లకు త్వరలో బిల్లులు రానున్నాయి. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-జయదేవ్ ఆర్యా, డీఆర్‌డీవో, సిద్దిపేట

న్యూస్ బాక్స్

8న నిజాంపేటలో చేప మందు పంపిణీ

నారాయణఖేడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలకేంద్రంలో మృగశిరకార్తెను పురస్కరించుకొని ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చేప మందును ఈనెల 8న పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పర్వాగౌడ్, నాగరాజుగౌడ్, శంకర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, సాయిబాబాగౌడ్‌లు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7.30గంటల నుంచి సాయంత్రం వరకు మందును అందిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 9989437111, 9676134067, 9000653438 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలి

చిలప్ చెడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్కుల్ గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలలో పీజీసీఈఆర్టీలుగా ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థులకు బోధించేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కస్తూర్బా ప్రత్యేక అధికారి అంజలి పేర్కొన్నారు. అభ్యర్థులకు పీజీలో 60 శాతం మార్కులు ఉండాలని తెలిపారు ఈ మేరకు తెలుగు, ఆంగ్లం, వృక్ష శాస్త్రం, ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులలో బోధించేందుకు అర్హత కలిగిన మహిళలు విద్యార్హత పత్రాలను పాఠశాలలో అందజేయాలని ఆమె సూచించారు.

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం నారాయణపూర్ సమీపంలోని బాలికల గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 13వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ గంగారాం, ప్రిన్సిపాల్ లలితాదేవి పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గిరిజన బాలికల గురుకుల కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. ఆసక్తిగల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

● కంగ్టి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని ఎస్టీ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం ఈనెల 9న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, పదో తరగతి మార్కుల మెమో, కుల నివాస, ఆదాయ ధ్రువ పత్రాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

సిర్గాపూర్ ఎస్ఐకి సీఐగా పదోన్నతి

నారాయణఖేడ్, జూన్ (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డికి సీఐగా పదోన్నతి లభించింది. వెంకట్‌రెడ్డి 2012లో ఎస్ఐగా ఎంపికయ్యారు. వెంకట్‌రెడ్డి గతంలో కల్హేర్, నారాయణఖేడ్, రాయికోడ్‌లలో ఎస్ఐగా పని చేయడమే కాకుండా ప్రస్తుతం సిర్గాపూర్ ఎస్ఐగా పని చేస్తున్నారు. సీఐగా పదోన్నతి లభించడంతో ఆయనను నియామకానికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

వెంకటరమణకు ఘన సన్మానం

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్య ప్రణాళిక కార్యాలయంలో సహాయ సంచాలకుడిగా విధులు నిర్వహించి హైదరాబాద్‌కు పదోన్నతిపై వెళ్తున్న వెంకటరమణను సంగారెడ్డిలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి బాలశౌరి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. వైద్యనాథ్, డా. సంతోష్‌కుమార్, సహాధ్యక్షుడు బలరాం, ఉపాధ్యక్షులు సాయిబాబా, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిపుణులతో బోధన: ఆర్డీవో

తూప్రాన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నిపుణులైన ఆధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం రామాయంపేట ప్రభుత్వ నూతన డిగ్రీ కళాశాల ప్రచార పోస్టర్‌ను ఆధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ. హుస్సేన్, అధ్యాపకులు భరత్‌కుమార్, వెంకటేశం, రాజు, సుజాత, భవానీ, నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'చింతా'ను కలిసిన మున్సిపల్ కమిషనర్

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ నూతన కమిషనర్‌గా వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై కమిషనర్‌తో చర్చించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

నారాయణఖేడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అశువులు బాసిన అమర జవాన్ల స్మారకార్థం ఖేడ్ శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. స్థానిక సీఐ శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించగా 60 మంది వరకు యువకులు తమ రక్తాన్ని దానం చేసి దేశభక్తిని చాటుకున్నారు.

దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోని రోడ్లు

- తారు కొట్టుకుపోయి గుంతలమయంగా మారిన చీలపల్లి, పోట్‌పల్లి రహదారులు
- చిన్న వర్షానికే జలమయం
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు




గుంతలమయంగా మారిన చీలపల్లితండా రోడ్డు, పోట్‌పల్లి గ్రామం సమీపంలో అధ్వానంగా తారురోడ్డు

ఝరాసంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు దశాబ్ద కాలం క్రితం వేసిన తారు రోడ్డు ఆ తర్వాత మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు గుంతల్లో నీరు నిండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చీలపల్లి క్రాస్‌రోడ్డు నుంచి చీలపల్లి తండా వరకు 2 కిలో మీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతో పాటు కంకర తేలింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే పలు గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు తారుకు నోచుకున్నది. ఆ తర్వాత నేటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో వాహనదారులతో పాటు ఆయా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రతినిత్యం న్యాల్‌కల్, రుక్మాపూర్, చీలపల్లితండాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం జహీరాబాద్ పట్టణానికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. వర్షపు నీరు గుంతల్లో నిలవడంతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే ఇక అంతే..

మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామం సమీపంలో తారు రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు, గ్రామస్థులకు నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రతి నిత్యం ఏల్గోయి, బర్దీపూర్, చీలపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ప్రయాణిస్తుంటారు. వర్షా కాలం వచ్చిందంటే ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ వరం

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి శాంతినగర్‌లోని ఓ రేషన్ షాపులో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు సన్నబియ్యం పంపిణీ ఓ వరంలాంటిదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని శాంతినగర్‌లో శుక్రవారం ఓ రేషన్‌షాపులో బియ్యాన్ని, తూకాన్ని, బియ్యం స్టాకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో ఈ నెల 30వ తేదీ వరకు లబ్ధిదారులందరికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ క్రాంతి ఆదేశించారు.

రైతులకు సోలార్ పంపు సెట్లు.

పోడు పట్టా భూములు కలిగిన రైతులకు సోలార్ పంపు సెట్లు అందించనున్నట్లు కలెక్టర్ క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరానికిగాను 73 మంది రైతులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రెండున్నర ఎకరాల భూమిని ఓ గ్రూప్‌గా తీసుకుని ఆ గ్రూప్‌లోని రైతులకు ఒక యూనిట్ రూ.6 లక్షలతో మోటార్లు, సోలార్ పంపు సెట్లు పంపిణీ చేయాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి శివప్రసాద్, జిల్లా అటవీ శాఖాధికారి శ్రీధర్‌రావు, పౌరసరఫరాల మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించడమే లక్ష్యం



రామాయంపేటలో లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

హవేళిఘణపూర్/రామాయంపేట/నిజాంపేట/పుల్కల్/కోహీర్, జూన్6,(ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను అందజేశారు. హవేళిఘణపూర్, రామాయంపేట, నిజాంపేట మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికి పక్క ఇండ్లు నిర్మించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట హౌసింగ్ పీడీ మాణిక్యం, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు సంగారెడ్డి జిల్లాలోని చౌటకూర్ మండలకేంద్రంతో పాటు కోర్పోల్, శివంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జోగిపేట వ్యవసాయ డివిజన్ ఆత్మకమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్ ముగ్గులు వేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలోహౌసింగ్ డీఈ మల్లేశం, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కోహీర్ మండల పరిధిలోని కవేలి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సురేఖ పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



అందోల్ మండలంలోని అల్మాయపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

జోగిపేట రూరల్/అల్లాదుర్గం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం పేరిట సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా గ్రామాల రైతులకు శుక్రవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సాగుపద్ధతులు, విత్తన ఎంపిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అందోల్ మండల పరిధిలోని అల్మాయపేట గ్రామంలో ఏరువాక కేంద్రం సంగుపేట, వ్యవసాయ ఇంజనిరింగ్ కళాశాల కంది వారి ఆధ్వర్యంలో రైతన్నలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడడం వల్ల సాగు ఖర్చును తగ్గించవచ్చని రైతులకు సూచించారు. చిరుధాన్యాలను సాగుతో రైతులు అదనపు లాభాన్ని అర్జించ వచ్చన్నారు. అల్లాదుర్గం మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏవో రాజేశ్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన

నాగల్‌గిద్ద/చేగుంట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాగల్గిద్ద మండల పరిధిలోని గురుసింగ్ తండాలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యాన వన అధికారి మౌనికరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పాం మొక్కలపై ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. అదేవిధంగా మెదక్ జిల్లాలోని చేగుంట మండలం మొక్కరాజుపేటలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఫీల్డ్ ఆఫీసర్ సుజాత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ఎకరా వరి సాగుకు సరిపోయే నీటితో ఐదు ఎకరాల ఆయిల్ పామ్ తోటను సాగు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు.

దేవుడి సేవతో మానసిక ప్రశాంతత

● టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి

సదాశివపేట, జూన్ 6: (ఆంధ్రజ్యోతి): సదాశివపేట పట్టణంలోని లోపలికోట హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా నాగారం శ్రీనివాస్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భగవంతుడికి సేవ చేసే అవకాశం లభించడం ఎంతో అదృష్టమని, దైవ సేవలోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి సహకారంలో ఆలయ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ గుప్తా, ఎండోమెంట్ అధికారులు రంగారావు, శివరుద్రప్ప, ఆలయకమిటీ మెంబర్లు గాజుల ఆశోక్, జయరాం, మనోహర్, బాలరాజు, పోల సంగమేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలతో ఆధ్యాత్మిక వాతావరణం



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి తన సహకారం అందిస్తానన్నారు. మాజీ ఎంపీటీసీ రాజయ్య, కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే విరాళం

రామచంద్రాపురం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీ సీతారామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భవాని కోటి పార్థివ పంచముఖ లింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు..

రామచంద్రాపుం టౌన్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్ పరిధి ఎంఐజీ కాలనీ శుక్రవారం 27 అడుగుల హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకు బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శరెడ్డి రూ.1,00,011లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వెంకటరావు, భాస్కర్, కుమార్, భీమ్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.



యూనిఫాం, పాఠ్యపుస్తకాలు తొలిరోజే పంపిణీ

(5వ పేజీ తరువాయి)

చేరుకున్నాయి. ఇందులో 5,57,955 పాఠ్యపుస్తకాలను జిల్లాలోని 29 మండలాలకు సరఫరా చేశారు. మిగతా పాఠ్యపుస్తకాలను నాలుగైదు రోజుల్లో పాఠశాలలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగా ఇప్పటికే నోటు పుస్తకాలను నేరుగా పై నుంచి పాఠశాల పాయింట్లకే చేరవేసిన విషయం తెలిసిందే. ఏదేమైనా బడుల ప్రారంభం రోజే యూనిఫామ్స్, పాఠ్యపుకాలు పంపిణీ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బడిబాట గ్రామసభలు

మనోహరాబాద్ మండలం రామాయపల్లిలో బడిబాటలో మెదక్ జిల్లా విద్యాఅధికారి రాధాకిషన్, పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో శుక్రవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలు, ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పేద విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడంలో సర్కారు బడులు ముందున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) ఆధారిత బోధన అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి వ్యయ ప్రయాసాలకు గురికాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. బాల్యవివాహాలు చేస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని తల్లిదండ్రులకు సూచించారు. బడికి రాని పిల్లలపై ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు వారిని పాఠశాలకు రప్పించేలా ప్రత్యేక కార్యాచరణతో అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బడిబయట పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు కృషి చేయాలని ఆయా జిల్లాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యక్రమాల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

పలు మున్సిపాలిటీల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి వైద్య పరీక్షలు

తూప్రాన్/నర్సాపూర్/నారాయణఖేడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పలు మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. తూప్రాన్ పట్టణంలో తడి పొడి చెత్త వేరు చేయడంపై కమిషనర్ గణేశ్‌రెడ్డి అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు చేశారు. పట్టణంలో తాగునీటి క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీపన్ను చెల్లింపులు డిమాండ్ నోటీసులను కమిషనర్ గణేశ్ రెడ్డి అందజేశారు. ఎక్స్‌వేటర్‌తో మురుగుకాలువలు శుభ్రం చేశారు. నర్సాపూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పలు వార్డుల్లో తడిపొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ రామకృష్ణరావు కోరారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ సమావేశ మందిరంలో శానిటేషన్ కార్మికులకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని 12వ వార్డులో తడి, పొడి చెత్త వినియోగంపై మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా అభివృద్ధి: బీజేపీ



బీజేపీ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

మెదక్ అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌కు ప్రకాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోదీ పాలనలో సాధించిన విజయాలపై నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుభాష్‌గౌడ్, రాగి రాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు రమేష్ గౌడ్, నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలి

నారాయణఖేడ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు వ్యర్థాలను మున్సిపల్ చెత్త వాహనాల్లోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వ్యర్థాలను వేయడానికి ముస్లింలకు ఖాళీ సంచులను పంపిణీ చేశారు. వ్యర్థాల సేకరణ కోసం వార్డులవారీగా ప్రత్యేకంగా మున్సిపల్ చెత్తసేకరణ వాహనాలను నడుపుతున్నామని, అందువల్ల ముస్లింలు వ్యర్థాలను ఖాళీ సంచులో వేసి ఆయా ప్రాంతాలకు వచ్చే వాహనాల్లో వేయాలని సూచించారు.


కేబినెట్ భేటీలో ఆర్టీసీ సమస్యలపై చర్చ ఏదీ?

సంగారెడ్డి అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేబినెట్ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చ జరగకపోవడం బాధాకరమని ఆర్టీసీ తెలంగాణ జాతీయ మజ్దూర్ సంఘ్(టీజేఎంయూ)రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్లకు అతీతంగా విస్తృతంగా ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే కేబినెట్ భేటీలో కార్మికుల సమస్యలపై స్పందన లేకపోవడం అవమానకరమన్నారు. ఆర్టీసీలో 3,026 పోస్టులు ఖాళీగా ఉన్నాయని భర్తీ చేస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్పా ఆచరణలో అమలు కావడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అన్ని సంఘాలు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రామీణ మహిళల అభివృద్ధిపై అవగాహన

నర్సాపూర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అలీప్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నర్సాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ పరిశ్రమల శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ అవగాహనలో పరిశ్రమ నిర్వాహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకవలు నైపుణ్యాభివృద్ధిపై వివరించారు.అదేవిధంగా పరిశ్రమల స్థాపకుల రుణ సదుపాయంతో పాటు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి, జిల్లా ప్రాజెక్టు అధికారి మోహన్, వయోజన విద్యాధికారి మురళి, ప్రాజెక్టు ఆఫీసర్ మహ్మద్, ఏపీఎంలు గౌరిశంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దుర్తి: అందుగులపల్లిలో రైతులతో మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

వెల్దుర్తి/చిన్నశంకరంపేట/ పాపన్నపేట/జోగిపేట రూరల్/నారాయణఖేడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల పరిధిలోని అందుగులపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఉప్పులింగాపూర్ గ్రామంలో అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలో శుక్రవారం నాలుగోరోజు భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పాపన్నపేట మండల పరిధి నామాపూర్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని ఆర్డీవో రమాదేవి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అందోల్ మండల పరిధిలోని అన్నసాగర్, రోళ్ళపహడ్ గ్రామాల్లో రైతుల నుంచి 111 ఫిర్యాదులు స్వీకరించినట్లు తహసీల్దార్ తేన్ములి తెలిపారు. నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌లో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ హసీనాబేగం పాల్గొని రైతుల సందేహాలను నివృతి చేశారు.

వేసవి తాపానికి చేపలు మృత్యువాత



గత వారం రోజులుగా వేసవి తాపానికి తాళలేక చేపలు మృత్యువాత పడుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి మండటెండల కారణంగా అందోల్ పెద్ద చెరువులో వందల సంఖ్యలో చేపలు మృత్యువాత పడి ఒడ్డుకు కొట్టుకు వచ్చాయి. ఈ చెరువుపై ఆధారపడి ఎంతోమంది మత్స్యకారుల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఒక్కసారిగా చేపలు మృతి చెందడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

- జోగిపేట రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి)